

# శవాలకు స్వాగతం

మెక్సికోలో మంటెనెరీ అనే ప్రాంతంలో ఇటీవల శవాలకు లభించిన ఘన స్వాగతం అందర్నీ ఆశ్చర్యపరచింది. మెక్సికోలో మరో ముఖ్య పట్టణం గుజరాంతో నుండి ఇటీవలే ఇక్కడకు తరలించిన మమ్మీలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. ఈ మమ్మీలను వందేళ్ళ క్రితం 1896 లో గుజరాంతోలో ఒక శ్మశానం నుండీ వెలికి తీసారు. అప్పట్లో అక్కడ ఒక చట్టం ఉండేది. చనిపోయినవారిని అక్కడ స్మశానంలో పూడ్చిపెట్టాక, వారి బంధువులు ఆ స్థలం కోసం నెల నెలా ప్రత్యేకంగా కొంత పన్ను కట్టవలసి ఉండేది. చాలా మంది ఆ పన్ను కట్టేవారు. కాని కొందరు మృతుల బంధువులు ఊరు విడిచి వెళ్ళిపోవడమో, లేదా ఆ మృతులే ఆ కుటుంబంలో చివరి వారు కావడమో జరిగేది. పన్నులు దొరకని ఇలాంటి శవాలను కొన్నాళ్ళ తర్వాత అధికారులు తవ్వి వెలికితీసేవారు. అప్పటికే అక్కడి పర్వత ప్రాంతపు పొడి వాతావరణం వాటిని పూర్తిగా శిథిలం కానీక మమ్మీల రూపంలో తయారు చేసేది. దాంతో వీటిని దగ్గర్లోని మ్యూజియంలో భద్ర పరుస్తూ వచ్చారు. అదృష్టవశాత్తూ 1958లో ఈ చట్టం రద్దు చేసారు. చట్టం రద్దయినా మ్యూజియంలో ఈ శవాలకు మాత్రం డిమాండ్ పెరుగుతూనే వచ్చింది. చివరకు ఆ మ్యూజియానికి ఇవే పెద్ద ఆకర్షణగా తయారయ్యాయి. ఇటీవలే మంటెనెరీ ప్రాంతంలో ఒక ఎగ్జిబిషన్‌లో వీటిని ప్రదర్శించడానికి తీసుకొచ్చారు. పదిహేను ఆడ శవాలు, ఎనిమిది మగ శవాల్ని కలిపి ఈ ప్రదర్శనకు తీసుకొచ్చారు. తమ పట్టణానికి అతిథులుగా వస్తున్న ఈ శవాల మూకకు నగర ప్రజలందరూ వీధుల్లోకి వచ్చి స్వాగతం పలికారట.



## 'సరసి' కథ

# శునకము - సున్నుండలు

వైశంపాయనుడుకి సున్నుండలంటే ఇష్టం. ఓ రోజు భార్య సుబ్బాయమ్మతో కలిసి సినిమాకి వెళ్లి, ఇంటి నుంచి తెచ్చుకున్న సున్నుండల్ని జేబులోంచి తీసి, చిదిపి, వొళ్లో పోసుకుని కాస్త కాస్త నోట్లో వేసుకుంటూ సినిమా చూడసాగేడు.

అదే సమయంలో సిటీలో జనసమ్మర్దం బాగా వున్న ఒక బజార్లో బాంబు పేలింది. పోలీసులు కుక్కల్ని తీసుకొచ్చి బాంబు పేలిన చోట వాసన చూపించారు. ఆ కుక్క వెళ్లి వెళ్లి వైశంపాయనుడున్న సినిమా థియేటర్లోకి దూరింది. పోలీసులు సినిమా ఆపించేసి, ఒక్క ద్వారం తెరిచి, కుక్కకి వాసన చూపిస్తూ ఒక్కొక్కరినీ బయటకు వదలసాగేరు. వైశంపాయనుడు రాగానే మూలిగినట్లు ఓ ధ్వని చేసి, ఎగిరి అతడి చొక్కా పట్టుకుంది కుక్క.

అంతే! పోలీసులు అతగాడిని మేనేజరు రూములోకి సగౌరవంగా తీసుకుపోయి, అగౌరవంగా ప్రశ్నించారు. తనకే పాపం తెలియదని అమాయకంగా ఫేసు పెట్టిన వైశంపాయనుడిని లాగి పెట్టి కొట్టేడు ఇన్స్‌పెక్టరు. ఇంతలో ఇన్స్‌పెక్టర్ మొబైల్ మోగింది. అసలు దోషి పాత బస్తీలో దొరికాడనీ, వెనక్కొచ్చేయమనీ డిపార్ట్‌మెంటు నుంచి కాల్.

సుబ్బాయమ్మగారు నడుం బిగించి పోలీసుల్ని తిట్లతో చెండాడేసింది. డిఫెన్సులో పడ్డ ఇన్స్‌పెక్టర్‌కి చెమటలు పట్టేశాయి. పక్కనే వున్న అనుభవజ్ఞుడైన ఓ కానిస్టేబుల్ వైశంపా



యనుడి వైపు వంగి, ముక్కుతో వాసన పీల్చినట్లు చేసి, ''మినప సున్నుండలేమన్నా తిన్నారా సార్ ఇందాకా.'' అని అడిగేడు. తలూపేడు వైశంపాయనుడు.

''మరి చెప్పరేం సార్! మా కుక్కకి సున్నుండలంటే చెడ్డిష్టం. ఆ వాసన తగిల్తే చాలు బాంబు వాసన మరిచిపోతుంది. సారీ, ఏమనుకోకండి. అన్నీ తెలిసిన మనుష్యులం మనమే అనేక తప్పులు చేస్తున్నాం. ఆఫ్టరాల్ ఒక కుక్క పొరపాటు చేయడంలో ఆశ్చర్యం ఏముంటుందండీ? పాపం, పశ్చాత్తాపంతో ఎలా కుమిలిపోతోందో చూడండి'' అన్నాడు ఆ కానిస్టేబుల్.

నిజంగానే గోడవారన కన్నీరు కారుస్తూ పశ్చాత్తాపంతో కుమిలిపోతూ కనిపించింది వైశంపాయనుడిని పీకిన కుక్క!!

*